ఈ క్రాప్ నమోదయ్యేనా?

● మూడు మాసాలైనా 50శాతం లోపే..
● ఇప్పటి వరకు 2.27లక్షల ఎకరాలు మాత్రమే
● ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

దిగాలులో రైతన్న

విపత్తులతో నష్టపోయినా.. పండించిన పంటలు అమ్ముకోవాలన్నా.. పంటల బీమా, తదితర పంట రుణాలు పొందాలన్నా.. ఈ క్రాప్ నమోదు చేయాల్సిందే. లేకుంటే అంతే సంగతులు. రైతుల పాలిట ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈక్రాప్ నమోదు ప్రక్రియ మాత్రం జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. జిల్లాలో5,10,200 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగుచేశారు. ఇప్పటి వరకు ఈక్రాప్ నమోదు 2,27,177 ఎకరాల్లో మాత్రమే చేపట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే నత్తనడకన సాగుతోంది. ఆ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంతగానే ఉంది. ఈనేపథ్యంలో జిల్లాలో గడువు లోపు వంద శాతం పంట నమోదు ప్రక్రియను ఆ శాఖ అధికారులు పూర్తిచేస్తారా ? లేక.. వివిధ సాకులు చూపి పంట తూతూ మంత్రంగా మమ అనిపించేస్తారా? అనే అనుమానాలు లేకపోలేదు.

నంద్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ నామమాత్రంగా సాగుతోంది. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా కనీసం 50శాతం కూడా నమోదు కాలేదు. ఉన్నతాధికారులు పర్యావేక్షణ లేకపోవడం.. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఈ-క్రాప్ నమోదు పూర్తిగా వెనుక పడిందనే విమర్శలు లేకపోలేదు. వీటికితోడు పంట నమోదు గడువు సైతం సమీపిస్తోంది. దీంతో రైతుల్లో ఆయోమయం నెలకొంది. ఇప్పటికైనా ఆశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికార లెక్కల ప్రకారం..

జిల్లాలో అధికార లెక్కల ప్రకారం.. 5,88,478 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఇప్పటి వరకు 5,10,200 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. కేవలం 2,27,177 ఎకరాల్లోని పంటను మాత్రమే నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన గడిచిన మూడు మాసాల్లో కనీసం 50శాతం కూడా పంటను నమోదు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే నత్తనడకన సాగుతోంది.



పంట నమోదు చేస్తున్న అధికారులు

వివిధ సాకులతో..

రైతులకు ఈక్రాప్ నమోదు చాలా కీలకం. అలాంటి ప్రక్రియ విషయంలో ఆశాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో ఈ పంట నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదు. కొన్నిచోట్ల వివిధ సాకులతో ఈక్రాప్ నమోదు జరగలేదని ఆ శాఖ సిబ్బంది వాదన.

క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు..

క్షేత్రస్థాయిలో నెలకొన్న వివిధ రకాల సమస్యలు, తరచూ వర్షాలతో ఆశించిన స్థాయిలో ఈ పంట నమోదు ప్రక్రియ సాగలేదని ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ప్రధానంగా కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, చుక్కలు, డీ పట్టా, అసైన్డ్, ఆటవీ తదితర భూముల వివరాలు వీఆర్వో, వీపీఏలు లాగిన్‌లో పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. వెబ్‌ల్యాండ్‌లో వివిధ సాంకేతిక లోపంతో భూముల వివరాలు కనిపిస్తున్నా ఈ పంట వివరాలు నమోదు కావడం లేదని సిబ్బంది వాపోతున్నారు. అక్కడక్కడ జరిగిన రీ సర్వే కారణంగా నేటికీ సమస్యలు ఏర్పడి పంట నమోదు అడ్డంకిగా మారింది. యూరియా పంపిణీపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టడం కూడా ఈక్రాప్ నమోదుపై ప్రభావం చూపినట్లైంది. ఇలా పలు రకాలు సమస్యలు క్షేత్రస్థాయిలో ఉండటంతో ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆశాఖ సిబ్బంది వాపోతున్నారు.

గడువు సమీపిస్తుండటంతో..

ఈ క్రాప్ నమోదు జాప్యంతో జిల్లాలోని రైతుల్లో ఆయోమయం నెలకొంది. ఒకవైపు గడువు సమీపిస్తుండటం.. మరోక వైపు సిబ్బంది భూముల వద్దకు ఇప్పటికి రాకపోవడంతో.. వారిలో ఈ పంట నమోదు గడువు లోపు జరుగుతుందా...? లేదా..? అనే సందేహాలు లేకపోలేదు. ఆశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం అంతంతగానే ఉంది. ఈనేపథ్యంలో జిల్లాలో గడువు లోపు వంద శాతం పంట నమోదు ప్రక్రియను ఆశాఖ అధికారులు పూర్తిచేస్తారా ? లేక.. వివిధ సాకులు చూపి పంట తూతూ మంత్రంగా మమ అనిపించేస్తారా? అనే అనుమానాలు లేకపోలేదు. ఏది ఏమైనా ఈ పంట నమోదు విషయంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలతో ఇటు రైతుల్లోనూ అటు ఆశాఖ ఉద్యోగుల్లోనూ ఆందోళన రేకెత్తిస్తోంది.



ఈ నెలాఖరికి పూర్తయ్యేలా చూస్తాం



జిల్లాలో ఈ పంట నమోదు ప్రక్రియ ఈ నెల ఆఖరికి పూర్తైయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా ఏడీలు, మండల ఏవోలకు అదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు పర్యావేక్షణ చేసి జిల్లాలో గడువులోపు వంద శాతం పంట నమోదు ప్రక్రియను పూర్తి చేస్తాం. నేను కూడా ఇటీవల ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నా. ఈ పంట నమోదు విషయంలో సిబ్బందికి రైతులు కూడా సహకరించాలి. ప్రతి రైతు పంటను నమోదు చేసేలా చూస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

● మద్దిలేటి, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, నంద్యాల

ప్రభుత్వ భూముల పరిశీలన



అధికారుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న జేసీ విష్ణుచరణ్

నందికొట్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిడ్తూరు మండలం నాగలూటి వద్ద ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశీలించారు. నాగలూటి పొలిమేరలో అదనంగా 254 ఎకరాలు గ్రీన్‌కో సోలార్‌కు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం నాగలూటి, పైపాలెం గ్రామాల మధ్యలో ఉన్న గట్టు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ రైతుల భూముల సరిహద్దులను, రోడ్డు మార్గాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాసగౌడ, జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పైపాలెం పొలిమేరలో జరుగుతున్న సోలార్ పనుల వల్ల రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నీటి కుంటలకు జీవాలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని, రైతుల పొలాలకు వెళ్లేందుకు 40 అడుగుల రస్తాను వేయాలని కోరారు. రైతులకు సంబంధించిన పట్టా భూములో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలను ఏర్పాటుకు గోతులు తీస్తున్నారని, రైతులు ప్రశ్నిస్తే వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామసభ తీర్మానం లేకుండా గ్రీన్‌కోకు భూమిని ఎలా కేటాయిస్తారని గ్రామస్థులు ప్రశ్నించారు. పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తామని, అయితే రైతులను ఇబ్బంది పెట్టే విధంగా కంపెనీ నిర్వాహకులు ప్రవర్తించడంతోనే ప్రశ్నించాల్సి వస్తోందని అన్నారు. గ్రామకంఠానికి కొంత భూమిని కేటాయించాలని కోరారు. సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు. జేసీ వెంట ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసులు గ్రీన్‌కో ప్రతినిధి శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకున్నరైతు కుటుంబం

70 ఏళ్ల నుంచి తాము అనుభవంలో ఉన్న పట్టా భూమిని నేడు తహసీల్దార్ పట్టా భూమి అని గ్రీన్ కో కంపెనీతో ఎలా కొట్టం వేయిస్తారని బోయ ఎల్లమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసులును అడ్డుకున్నారు. తమ పొలాన్ని సర్వే చేయించి ఇవ్వాలని పదేపదే వినతిపత్రాలు సమర్పిస్తున్నా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి జిల్లా వాసులు క్షేమంగా ఉన్నారు

● నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్



నేపాల్‌లో చిక్కుకున్న నంద్యాల వాసులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేపాల్ రాజధాని ఖాట్మండ్‌కు విహారయాత్రకు కెళ్లి అక్కడి అల్లర్లలో చిక్కుకున్న ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులు 50 మంది క్షేమంగా ఉన్నారని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ శుక్రవారం తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర ప్రభుత్వం చొరవతో వారిని ఆదివారం తమ స్వస్థలాలకు తీసుకురానున్నట్లు తెలిపారు. వీరిని ముందుగా ఖాట్మండ్ నుంచి విమానంలో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు, అక్కడి నుంచి మధ్నాహ్నం 1.50 నిమిషాలకు విమానంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి బస్సుల్లో స్వస్థలానికి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఇందులో నంద్యాల జిల్లాకు చెందిన 28 మంది, కర్నూలు జిల్లాకు చెందిన 22 మంది ఉన్నట్లు తెలిపారు. మంత్రులు నారా లోకేశ్, అనిత, టీజీ భరత్, ఫరూక్ ఫోన్‌లో మాట్లాడినట్లు బాధితుడు బాలాజీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాము క్షేమంగా ఉన్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎప్పకప్పుడు తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి సమస్యలపై వెంటనే స్పందిస్తారన్నారు. మన తెలుగువారు ఏ దేశంలో ఎక్కడ చిక్కుకున్న వెంటనే చొరవ తీసుకొని రక్షిస్తారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

● మున్సిపల్‌శాఖ రీజనల్ డైరెక్టర్ నాగరాజు

ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్‌శాఖ అనంతపురం రీజనల్ డైరెక్టర్ నాగరాజు సూచించారు. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు వార్డుల్లో పర్యటించి ఆస్తి పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. అదేవిధంగా పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన పట్టణ శివార్లలో డంప్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కమిషనర్ రమేష్‌బాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రామకృష్ణ ఉన్నారు.

'నిర్లక్ష్యం తగదు'

నందికొట్కూరు: ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదని పురపాలక సంఘం ప్రాంతీయ సంచాలకుడు నాగరాజు అన్నారు. పట్టణంలోని 14 సచివాలయాల సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలో అంచనా వేసిన, తక్కువ అంచనా ఉన్న ఆస్తులను గుర్తించి పన్నులు విధించాలన్నారు. అనధికార నీటి కనెక్షన్లు, భవన నిర్మాణాలు, ఖాళీ స్థలాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నివారించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

ఎడతెరిపి లేని వాన

● ఉగ్రరూపం దాల్చిన కుందూ, వక్కిలేరు
● స్తంభించిన రాకపోకలు ● నీట మునిగిన పొలాలు



కలుగొట్లపల్లె వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం శుక్రవారం తెల్లవారుజామున కురిసింది. 13.2 మీ.మీ. వర్షపాతం నమోదైంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది పొంగి ప్రవహించింది. కుందూలో 28 వేల క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్టవద్ద గల 5 గేట్లను ఎత్తి కడప జిల్లా వైపు వరద నీటిని విడుదల చేశామని చెప్పారు. పరిసర గ్రామాల ప్రజలు, కూలీలు, రైతులు నది దాటే ప్రయత్నం చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేలంపాడు, రాంపల్లె గ్రామాల్లో సాగు చేసిన బెండ, జూట్, మొక్కజొన్న పంటలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. రాంపల్లె గ్రామంలో మొక్కజొన్న నేలవాలింది. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించింది. దీంతో ఆయా గ్రామ ప్రజల రాకపోకలు స్తంభించాయి. నేలంపాడు గ్రామంలో రహదారి జలమయమైంది. గ్రామాల్లో మట్టిమిద్దెల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, పోలీసులు సూచించారు.



నేలంపాడులో నీట మునిగిన పంట పొలాలు

15న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో 2025-26విద్యాసంవత్సరానికిగాను ఈ నెల 15న గుంటూరు కృష్ణా ఆడిటోరియంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ డా.ఎం.జాన్సన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేయని విద్యార్థులు కూడా అర్హత ఉంటే ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావచ్చని తెలిపారు.

కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

● 53 మండలాల నుంచి హాజరు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు సాగిన శిక్షణ శుక్రవారం ముగిసింది. 53 మండలాల నుంచి ప్రతి మండలం నుంచి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు స్వంత ఆదాయ వనరుల అంశంపై జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రంలో శిక్షణకు హాజరయ్యారు. పంచాయతీ అభివృద్ధికి స్వంత ఆదాయ వనరుల సృష్టి, స్వంత ఆదాయంలో పన్ను వనరుల, పన్ను వసూళ్లతో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించారు. శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి పి.భాస్కర్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీవోటీలు ఏ.జేమ్స్ కృపవరం, పి.ప్రభాకర్, అన్వర్‌బాషా, పి.జగన్నాథం, డీకే.దస్తగిరిబాషా పాల్గొన్నారు.

బార్ల దరఖాస్తుకు గడువు పొడిగింపు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని రెండు బార్ల దరఖాస్తుకు గడువు పొడిగించినట్లు ఎక్సైజ్ ఈఎస్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. డీడీ రూపంలో, నెట్ బ్యాంకింగ్ రూపంలో నగదు చెల్లించవచ్చన్నారు. 18వ తేదీన ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో ఒకటి ఓపెన్ క్యాటగిరిలో, మరొకటి గీత కులాల రిజర్వ్‌డు క్యాటగిరిలో లాటరీ తీయనున్నట్లు చెప్పారు.

టెక్నాలజీకి తోడ్పాటు



క్వాంటం టెక్నాలజీ వైపు అడుగులు
6
ప్రతిభకు ప్రోత్సాహం



ఆకాశవాణి కేంద్ర నిర్వాహకులతో విద్యార్థులు

నిలకడగా శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో వరద నిలకడగా కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జూరాల స్పిల్ వే, హంద్రీ, సుంకేసుల నుంచి 1,41,103 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. అదేవిధంగా శ్రీశైలం విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తరువాత 66,167 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 206 టీఎంసీలుగా నమోదైంది.



ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసిన జగన్

మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులను వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దళితులను మోసం చేసిన వారు బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు తీసుకున్న వారు రుణాలు చెల్లిస్తేనే కొత్తవారికి రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. షెడ్యూల్ కులాల యువతకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌లో యువతకు శిక్షణ ఇవ్వడానికి రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే రూ.3కోట్లు విడుదల చేశామని, మరో రూ.2 కోట్లు పెండింగ్‌లో ఉందని తెలిపారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతుల పనులను రూ.3.90 కోట్లుతో చేపట్టనున్నట్లు వివరించారు. రూ.340 కోట్లతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులతో అర్హులైన లబ్ధిదారులకు రుణాలిచ్చేందుకు ప్రణాళికలు అప్పటికే పూర్తిచేశామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవి, డైరెక్టర్ జేమ్స్, పోతురాజు రవికుమార్, తిరుపాలు, మాదిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

దళితుల సంక్షేమమే లక్ష్యం

కర్నూలు అర్బన్: దళితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. వైసీపీ నేతలు రాష్ట్రాభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో డీసీఎం హెచ్‌చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, కేతు సుబ్బారెడ్డి, ఏసన్న, గున్నామార్క్, తిరుపాలు, శేషగిరి, శివ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బజారన్న తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో డాకానాయిని బ్రిడ్జి

వంతెనలు శిథిలం

● ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే దుస్థితి ఉంది. అనంతపురం, తాడిప్రతి, గుత్తి, బళ్లారి ప్రాంతాల నుంచి కడప, నెల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఈ రోడ్డు మీదే వెళ్తుంటాయి. కొలిమిగుండ్ల సమీపంలోని డాకానాయిని బ్రిడ్జితో పాటు, కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగుపై ఉన్న వంతెన అత్యంత ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రాష్ట్ర హైవే కావడంతో పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

● మరోవైపు భారీ వర్షాలు కురిస్తే కల్వటాల వద్ద ఎర్రవాగు వంతెనపై వరద నీరు పెద్ద ఎత్తున ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో భారీ వర్షాలు కురిస్తే గంటల తరబడి కొలిమిగుండ్ల మండలం నుంచి కడప జిల్లాకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం త్వరితగతిన నూతన వంతెనలు నిర్మించి, ప్రమాదాలు అరికట్టాలని కోరుతున్నారు.



కల్వటాల గ్రామం వద్ద రక్షణ గోడలేని ఎర్రవాగు వంతెన

జిల్లా కోర్టులో ఈసేవా కేంద్రం ప్రారంభం

కర్నూలు లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఈ సేవా కేంద్రాన్ని కర్నూలు జిల్లా న్యాయాధికారి జి.కబర్ది శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈసేవా కేంద్రంలో అన్నికోర్టులకు సంబంధించిన సమాచారాన్ని కక్షిదారులకు అందిస్తారని న్నారు. కక్షిదారులు ఈసేవా కేంద్రాల ద్వారా సుప్రీం కోర్టు, హైకోర్టులు, జిల్లా కోర్టుల తీర్పు కాపీలను పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్ చౌదరి, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఈసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ది

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పాణ్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి పెదరాయుడు రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10 వతేదీన కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన విలువిద్య జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. బాలవర్ధన్ స్టాండ్‌బైగా ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీడీ హమీదాను ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజశేఖర్ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత: సీఎఫ్‌వో

బండిఆత్మకూరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడవులను రక్షించుకోవటం అందరి బాధ్యత అని సీఎఫ్‌వో కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన బండిఆత్మకూరు అటవీ కార్యాలయ ఆవరణంలో రూ.10 లక్షలతో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సీఎఫ్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పట్టుదలతో అడవులను కాపాడుకోవాలన్న ఆకాంక్షతో పనిచేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. వణ్య ప్రాణుల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌డీ అనురాగ్‌మీనా, ఎఫ్ఆర్వోలు నజీర్ఖా, శ్రీనివాసులు, ఉదయ్‌దీప్, సిబ్బంది, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పెథాలజీ వైద్యుల రాష్ట్ర సదస్సు ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీ వైపు అడుగులు వేస్తోందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పెథాలజీ అండ్ మైక్రో బయాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెథాలజీ వైద్యుల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఐఏపీఎం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ నీరజరెడ్డి, ఏపీ పాథ్కాన్ ఆర్గనైజింగ్ చైర్మన్ పెథాలజీ హెచ్‌వోడీ డా.బాలీశ్వరి తదితరులు హాజరయ్యారు. ముందుగా వైద్యులు జ్యోతి ప్రజ్వలనచేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శరీరంలోని వ్యాధులను రోగ నిర్ధారణ చేయడంలో పెథాలజీ విభాగం ఎంతో కీలకమైందని అన్నారు. ప్రతి మెడికల్ కాలేజీలో పరిశోధన కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోగుల వ్యాధు లను గుర్తించి వైద్యం అందించడంలో పెథాలజి వైద్యులు అందించే రిపోర్టులే కీలకమని అన్నారు. పెథాలజీ గతంలో కన్నా ఇప్పుడు ఎంతో పురోగతి సాధించిందన్నారు. రోగులకు ఆపరేషన్ చేయాలన్నా వైద్యం అందించాలన్నా పెథాలజీ వైద్యులు సహకారం తప్పనిసరి అని డాక్టర్ హరిచరణ్ అన్నారు. రాష్ట్రస్థాయి పెథాలజీ సదస్సు కర్నూలు మెడికల్ కాలేజీ లో నిర్వహించడం యువ వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ బాలీశ్వరి పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డు వీసీ డా.ఏవీ కృష్ణమరాజు, ఐఏపీఎం సెక్రటరీ డా.మారుతి, అబ్జర్వర్ డా.శ్రీనివాసులు, కోశాధికారి డా.కుమార్ రాజు, విభాగాధిపతి పీవీ రమణబాబు, వైద్యులు అసోసియేట్ ప్రొఫెసర్ డా.రేవతి పాల్గొన్నారు.

16 నుంచి జిల్లా జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్ కార్యదర్శి విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న నంద్యాల పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో అండర్-14, అండర్-17బాల, బాలికల జూడో జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 17న బాక్సింగ్ అండర్-14, 17బాల,బాలికల జట్లు 18న ఫెన్సింగ్, టేబుల్‌టెన్నిస్ అండర్-14, 17బాల, బాలికల జట్లు ఎంపిక చేస్తామని వివరించారు. విద్యార్థులు అర్హతాపత్రం హెచ్ఎంల సంతకంతో పాటు మిడ్‌డే మిల్స్ ఫారం కూడా తీసుకురావాలని సూచించారు. లీగ్ యాప్‌లో క్రీడాకారుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిఅని, సొంతకిట్లతో పోటీలో పాల్గొనాలని కోరారు.

నేడు, రేపు విలేకరులకు పునశ్చరణ తరగతులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే జిల్లాశాఖ సహకారంతో గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు తెలిపారు. నగరంలోని మౌర్యఇన్‌లోగల పరిణయ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు విలేకరుల పునశ్చరణ తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ వ్యవహరిస్తారని, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సమాచారశాఖ డీడీ జయమ్మ హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, కార్యవర్గ సభ్యుడు కె. శ్యామ్‌సుందర్‌లాల్ పాల్గొంటారని తెలిపారు.

టెక్నాలజీకి తోడ్పాటు

రైతుల్లో మక్కువ

వ్యవసాయరంగంలో కూలీల కొరత వెంటాడుతోంది. కర్షకులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. అటు కూలీల కొరత, ఇటు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు రాష్ట ప్రభుత్వం డ్రోన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. సబ్సిడీపై డ్రోన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఐదుగురు కూలీలు చేసే పని డ్రోన్ ఒక్కటే చేస్తుంది. డ్రోన్‌తో పురుగుమందు పిచికారి చేయడంతో మొక్కలన్నింటికీ మందు సమానంగా అందుతుంది. పురుగు మందే కాకుండా ఎరువులు, విత్తనాలు పొలాల్లో డ్రోన్ల సాయంతో వెదజల్లవచ్చు. ప్రతి ఐదుగురు రైతులు కలిసి గ్రూపుగా ఏర్పాటు కావాలి. ప్రతి గ్రూపులో ఒక రైతుకు డ్రోన్ వినియోగంపై శిక్షణ కూడా ఇస్తారు.

- సబ్సిడీపై డ్రోన్లు
- ఐదుగురు రైతులతో గ్రూపు ఏర్పాటు
- యూనిట్ ధర రూ.9.80లక్షలు
- జిల్లాకు 45 డ్రోన్లు మంజూరు

రుద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులను సాంకేతిక వైపు నడిపించేందుకు రాష్ట ప్రభుత్వం దృష్టిపెట్టింది. వ్యవసాయానికి సబ్సిడీపై డ్రోన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. జిల్లాకు 45డ్రోన్లు సబ్సిడీపై మంజూరు చేశారు. ఇప్పటికే సబ్సిడీపై డ్రోన్లను అందించి యువతరానికి టెక్నాలజీని తోడ్పాటు చేసింది. టెక్నాలజీని అందిపుచ్చుకుని వ్యవసాయరంగంలో రైతులు డ్రోన్లను ఉపయోగించడానికి మక్కువ చూపుతున్నారు.



మొక్కజొన్న పంటపై పిచికారీ చేస్తూ..

ఒక్క రోజుల్లో 20 ఎకరాల్లో..

డ్రోన్ సాయంతో ఒకరోజు 20 ఎకరాల్లో వంటలకు పురుగుమందు పిచికారి చేయవచ్చు. ఒకవైపు సమయం, మరో వైపు పురుగుమందు ఆదా అవుతుంది. ఎకరాకు 10లీటర్ల నీటిలో కలిపి ఒకే మోతాదులో పిచికారి చేయడంతో పొలంలో సమానంగా పురుగు మందు పిచికారి చేయడానికి ఉపయోగపడుతున్నాయి. రుద్రవరం మండలంలో రైతులు డ్రోన్ల సాయంతో పురగుమందును వరి, మొక్కజొన్న పొలాలకు పిచికారి చేస్తున్నారు.



12 రోజుల పాటు శిక్షణ

రైతులు వ్యవసాయరంగంలో మేలైన వ్యవసాయం చేసేందుకు ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడాలి. ఐదుగురిలో ఒకరు ఇంటర్మీడియట్ పాసై ఉండాలి. వారికి గుంటూరు లాంఫాంలో 12రోజుల పాటు శిక్షణ ఇస్తారు. డ్రోన్‌కు నలుగురితో పాటు శిక్షణ పొందిన ఐదో వ్యక్తి ఆధ్వర్యంలో సేవలు అందించేందుకు సౌకర్యంగా ఉంటుంది. వ్యవసాయ రంగానికి అందించే యూనిట్ ధర రూ.9.80లక్షలు ధరగా నిర్ణయించారు. రైతు గ్రూపు నుంచి (వాటాధర) రూ.1.96లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రూ.7.84లక్షలు సబ్సిడీ కింద మంజూరవుతుంది. ఇది వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో మంజూరు చేయబడుతుంది. వారి పర్యవేక్షణలో డ్రోన్ సేవలు రైతులకు అందుతాయి.



డ్రోన్ వద్ద రైతులు

కూలీలతో అవసరం లేకుండా..



కూలీల అవసరం లేకుండా ఒకేరోజు ఎక్కువ మొత్తం పొలంలో డ్రోన్ సాయంతో పురుగుమందు పిచికారి చేయవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువపొలం పిచికారి చేసేందుకు ఆస్కారం ఉంది.

● మైసూరారెడ్డి, రైతు, నరసాపురం

సమానంగా అందుతుంది



పురుగు మందు ప్రతి మొక్కపై సమానంగా పడుతుంది. దీంతో పురుగు చనిపోతుంది. ఇకపోతే ఓ చోట ఎక్కువ, మరో చోట తక్కువ అనేది లేకుండా ఉంటుంది. సమయం, పురుగు మందు ఆదా అవుతుంది కూడా.

● దార్వాడ హుసేన్‌బాషా, రైతు, రుద్రవరం

ఉపాధి పొందుతున్నా



వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెరగడంతో ఉపాధి పొందుతున్నా. రుద్రవరం, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు మండలాల్లో వరి పంటపై డ్రోన్‌తో మందు పిచికారి చేస్తున్నా. రైతులకు సమయం ఆదా అవుతుంది.

● రాజు, డ్రోన్ ఆపరేటర్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి




రాష్ట ప్రభుత్వం డ్రోన్లను సబ్సిడీపై అందిస్తుంది. ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడాలి. ఒకరు ఇంటర్మీడియట్ పాసై ఉండాలి. ఇంటర్ పాసైన రైతుకు 12 రోజు పాటు డ్రోన్ నిర్వహణపై శిక్షణ ఇస్తుంది. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

● సుమతి, ఏవో, రుద్రవరం

అవినీటి కరకట్టలు

భూగర్భజలాల రీచార్జ్ కోసం నిర్మించే పెర్కోలేషన్ ట్యాంకుల నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. దీంతో కొన్ని నెలలకే అవి కోతలకు గురవుతున్నాయి. ఈ ట్యాంకులను 120మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తుతో నిర్మించాలి. ట్యాంకు నిర్మించే చోట నీరు ఆగే ప్రాంతంలో మట్టిని తీసి కరకట్టకు వేయాలి. గట్టిగా ఉండేలా రోలింగ్ చేయాలి. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో తూతూ మంత్రంగా నిర్మాణాలు జరిగాయి. ఇటీవలే కురిసిన చిన్నపాటి వర్షాలకే కరకట్టలు కోతకు గురి అయ్యాయి. ఇక భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


- ట్యాంకుల నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు
- ఏడాది గడవకముందే కోతలు
- నిర్మాణానికి మించిన అంచనా వ్యయం
- బట్టబయలు చేయని అధికారులు



కరకట్ట పై భాగంలో చీలిన దృశ్యం

కట్టపై రోలింగ్ చేయాలి

పెర్కోలేషన్ ట్యాంకులను 120మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తుతో నిర్మించాలి. ట్యాంకు నిర్మించే చోట నీరు ఆగే ప్రాంతంలో మట్టిని తీసి కరకట్టకు వేయాలి. కరకట్ట గట్టిగా ఉండేలా కట్టపై రోలింగ్ చేయాలి. ఎక్కడి వరకైతే నీరు నిలుస్తాయో అక్కడి వరకు లోపలివైపు కట్ట దెబ్బతినకుండా రాళ్లను పొందుపరచాలి. కరకట్ట దెబ్బతినకుండా ఒక చోట తూము ఏర్పాటు చేయాలి.



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల రీచార్జింగ్ కోసం నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించిన పెర్కోలేషన్ ట్యాంకు(కృత్రిమ జలాశయాలు) నిర్మాణాలు నాసిరకంగా జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈట్యాంకులు నిర్మించి ఏడాది గడవక ముందే కరకట్టలు చిన్నపాటి వర్షాలకే కోతలకు గురవుతున్నాయి. నిర్మాణ సమయంలో అధికారులు సరిగా పర్యవేక్షించకలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైక్రో వాటర్ షెడ్‌కింద ఒక్కోక్కటి రూ.7.09 లక్షల అంచనా వ్య యంతో ఎమ్మిగనూరు మండలంలోని వెంకటగిరి గ్రామ సమీపంలో ఉన్న బనవాసి అటవీ క్షేత్రం, కడివెళ్ల గ్రామ సమీపంలోని కొండ దగ్గర ట్యాంకులు నిర్మిచా రు.

రాళ్లు పెట్టి వదిలేశారు

ట్యాంకులను 120మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తు నిర్మించినప్పటికి కట్ట బలంగా ఉండేందుకు రోలింగ్ చేసిన దాఖలాలు కనిపించటం లేదు. కరకట్ట లోపల భాగం నీరు ఎక్కడవరకు నిలుస్తాయో అక్కడివరకు రాతిపరుపు ఏర్పాటు చేయాల్సి ఉండగా కట్ట మధ్యలో మాత్రమే రాళ్లు పెట్టి వదిలేశారు. కడివెళ్లలో మధ్యలో కొంతమేర వదిలేసి రాళ్లు పరిచారు.

భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి

ఇటీవల కురిసిన వర్షాలకు కరకట్ట కోతలకు గురైంది. కట్ట ఆచివరి నుంచి ఈ చివరివరకు కట్టపై నుంచి నీరు పారి కోత కోసుకుపోయింది. అంతేగాకి కట్టపైభాగంలో నెర్రెలు ఇవ్వడం పనులు ఎంత నాణ్యతా ప్రమాణాలతో జరిగాయో ఇట్టే తెలుస్తోంది. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవంగా ఎంత ఖర్చు చేశారో..

మైక్రోవాటర్ షెడ్ కందనాతి కింద బనవాసి అటవీ క్షేత్రంలో, కడివెళ్ల గ్రామ సమీపంలోని పెద్దయ్య పొలం దగ్గర పెర్కోలేషన్ ట్యాంకులను నిర్మించారు. అంచనా వ్యయం ఒక్కోక్క ట్యాంకు నిర్మాణానికి రూ.7లక్షలు అయితే దాదాపు రూ.6 నుంచి రూ. 8 లక్షల మేర ఖర్చుచేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ట్యాంకు నిర్మించిన ప్రాంతంలో అంచనా వ్యయం మాత్రమే రాసి వాస్తవంగా ఎంత ఖర్చు చేశారో మాత్రం రాయలేదు.

ట్యాంకులు దెబ్బతింటే మరమ్మతులు చేయిస్తాం

పెర్కోలేషన్ ట్యాంకులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించారు. ట్యాంకులు దెబ్బతిని మరమ్మతులకు గురైతే ఏవాటర్ షెడ్ కమిటీ పనులు చేసి ఉంటారో ఆ కమిటీతోనే మరమ్మతులు చేయిస్తాం. కొంత మొత్తం కమిటీ దగ్గర ఉంటుంది.

● వలి బేగ్, ఏపీడీ, కర్నూలు



వర్షాలకు కట్టకు కోతలు పడిన దృశ్యం



బనవాసి అటవీ క్షేత్రంలో నిర్మించిన పెర్కోలేషన్ ట్యాంకు

ప్రతిభకు ప్రోత్సాహం


- సృజనాత్మకతను వెలికితీస్తున్న హెచ్ఎం సురేష్‌బాబు
- 'చిన్నారిలోకం'లో విద్యార్థులు



కర్నూలు ఆకాశవాణి కేంద్రంలో చిన్నారిలోకం కార్యక్రమంలో పాల్గొన్న డోన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

డోన్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ఆ ఉపాధ్యాయుడు నిరంతరం కృషిచేస్తున్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఆకాశవాణిలో 'చిన్నారిలోకం' కార్యక్రమంలో పాల్గొనేలా చొరవ చూపాడు. ప్రభుత్వ నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోగాట సురేష్‌బాబు. విద్యార్థులను ఏటా కర్నూలు లోని ఆకాశవాణి కేంద్రానికి తీసుకెళ్తారు. అక్కడ 'చిన్నారిలోకం' కార్యక్రమంలో పాల్గొని వారి ప్రతిభకు ప్రోత్సాహం అందేలా కృషి చేస్తున్నారు. 2024 ఆగస్టు నెలలో, ఈ ఏడాది జనవరిలో పాఠశాలకు చెం దిన పదో తరగతి విద్యార్థులు రమ్య, బన్ని, వీరేంద్ర, బ్రహ్మేంద్ర, 9వ తరగతి విద్యార్థినులు సాలమ్మ, మాధురి, 8వ తరగతి విద్యార్థినులు మహాలక్ష్మి, కామాక్షి, 7 వ తరగతి విద్యార్థినులు దీపిక, అంజలిల ప్రతిభను గుర్తించి 'చిన్నారిలోకం' పాల్గొనేటట్లు చొరవ చూపించారు. వారితో దేశభక్తి, లలిత, జానపద గీతాలు, బాలగేయాలు, సామెతలు, పొడుపు కథలు, శతక పద్యాలు, శ్లోకాలు పాటలు, నాటికల ద్వారా చేయించి వారి ప్రతిభతో బహుమతులు అందుకునేలా చేశారు.

చదువుతో పాటు ఇతర రంగాల్లో..



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నాం. చదువుతో పాటు ఇతర రంగాల్లో వారికు న్న ప్రతిభను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడం లక్ష్యం.

● తోగాట సురేష్‌బాబు, హెచ్ఎం, నెహ్రూనగర్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, డోన్

జిల్లాలో 80 సీజనల్ వసతి గృహాలు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వలస వెళ్తున్న తల్లిదండ్రుల పిల్లలు డ్రాపౌట్స్ కాకుండా జిల్లాలో 80 సీజనల్ వసతి గృహాలు (సీజనల్ హాస్టల్స్) ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు, తుగ్గలి, పత్తికొండ, క్రిష్ణగిరి, ఆదోని, మంత్రాలయం, కౌతాళం, కోసిగి, హోళగుంద, హాలహర్వి, మద్దికెర, పెద్దకడుబూరు మండలాల్లో సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి గలిగి ఉండి సేవాభావం కలిగిన పొదుపు సంఘాలు, ఎన్జీవోలు 2025-26 విద్యాసంవత్సరానికి గానూ సీజనల్ హాస్టల్స్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు అన్ని డాక్యుమెంట్లతో ఈ నెల 16వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు.

అవినీతి అధికారులపై చర్యలు

• ఉత్తర్వులు ఇచ్చిన ఏపీ ఉప లోకాయుక్త రజనీ

కల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల తసీల్దార్‌గా గతంలో పనిచేసి అవినీతికి పాల్పడ్డ టి.అంజనాదేవి, వీఆర్వో కేఎల్ వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ ఉప లోకాయుక్త పి.రజనీ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన వి.మురళీధర్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులైన అప్పటి కల్లూరు తహసీల్దారు టి.అంజనాదేవి, లక్ష్మీపురం వీఆర్వో కేఎల్ వరప్రసాద్ కలిసి దూపాడు సర్వే నెంబర్ 15-4లో రూ.4 లక్షలు లంచం తీసుకుని చట్టవిరుద్ధంగా కొందరికి నకిలీ ఇంటి స్థల పట్టాలు జారీ చేశారని ఆరోపిస్తూ ఏపీ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఏపీ ఉప లోకాయుక్త పి.రజనీ సదరు ఫిర్యాదుపై విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ ఆదేశాలను అనుసరించి ఏపీ ప్రభుత్వ భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కర్నూలు జాయింట్ కలెక్టర్ ద్వారా విచారణ నిర్వహించి టి.అంజనాదేవి, కేఎల్ వరప్రసాద్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకొని మాజీ తసీల్దారుకు ఒక సంవత్సరం పాటు వేతన శ్రేణి తగ్గింపు (పెన్షన్‌పై ప్రభావం పడకుండా), కేఎల్ వరప్రసాద్‌కు రెండు వార్షిక వేతన ఇంక్రిమెంట్లు నిలిపివేశారు.

మోడల్ స్కూల్‌లో తేనెటీగల దాడి

• 112 మంది విద్యార్థులకు గాయాలు



విద్యార్థులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. మధ్యాహ్నం భోజన సమయం విరామంలో విద్యార్థులు భోజనం చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో తేనెటీగల దాడికి విద్యార్థులు అరుపులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. తేనెటీగల దాడిని పసిగట్టిన ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థులను తరగతి గదిలోకి తరలించారు. అయితే తేనెటీగల దాడిలో సుమారు 112 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. దీంతో ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి విద్యార్థులను స్థానిక ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులకు మాత్రమే తీవ్రగాయాలు కాగా.. మిగతా మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయలు కావడంతో చికిత్సను అందించి ఇంటికి పంపించారు. చికిత్స అనంతరం ముగ్గురు విద్యార్థులు కూడా క్షేమంగా ఉన్నారని డాక్టర్ నాగరాజు చెప్పారు. టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు బలరాం, గోపాల్‌నాయుడు, రవీంద్రగౌడ్ ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు.

బస్సు ఢీ.. యువకుడి దుర్మరణం



రంజిత్ (ఫైల్)

హొళగుంద, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీ కొని యువకుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. పెద్దహ్యాట గ్రామానికి చెందిన రంజిత్(18) హొళగుందలోని ఫోటో స్టూడియోలో పనిచేస్తుండేవాడు. శుక్రవారం ఉదయం సులువాయికి చెందిన చిన్న ద్యావన్న అనే వ్యక్తితో కలిసి బైక్‌పై రంజిత్ బయలుదేరాడు. హొళగుంద సమీపంలోని శబరి ఆశ్రమం వద్ద, ఆలూరు నుంచి హొళగుంద మీదుగా ఆదోనికి వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ బస్సును ఢీ కొంది. దీంతో బైక్‌పై వెనకవైపు కూర్చున్న రంజిత్ ఎగిరి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. హొళగుంద ప్రభుత్వ అస్పత్రికి, అనంతరం ఆదోనికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడు తండ్రి రంగస్వామి పిర్యాదు మేరకు డ్రైవర్ హనుమంతును అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. కాగా అంబులెన్సు అందుబాటులోకి లేకపోవడం, తీవ్ర రక్తస్రావం కావడంతో మృతిచెందినట్లు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి



గురులక్ష్మీదేవి (ఫైల్)

వెలుగోడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఓ ట్రాక్టర్ వ్యవసాయ కూలీలతో వెళ్తూ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు త్రీవంగా, మరి కొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం వెలుగోడులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన గాదే రామాంజనేయులు భార్య గాదే గురులక్ష్మీదేవి (45) తన పంట పొలానికి ఎరువులు, వ్యవసాయ కూలీలతో ట్రాక్టర్‌పై బయలుదేరారు. అయితే గ్రామ శివారులోని గాలేరు నది సమీపంలో గంగమ్మ మలుపు వద్ద ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ట్రాక్టర్‌లో సుమారు 14 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కూలీలపై ఎరువు బస్తాలు పడడంతో గాదే గురులక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. ఫైజూన్ అనే మరో మహిళ తీవ్రంగా గాయపడింది. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

పెద్దకడబూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకడోణ గ్రామానికి చెందిన హసీనా(35) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. రెహంతుల్లాకు ఎమ్మిగనూరు మండలం టీఎస్ కూలురు గ్రామానికి చెందిన హసీనాతో 2006 లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతూ ఉండేవారు. శుక్రవారం కూడా గొడవ పడ్డారు. క్షణికావేశానికి గురైనా హసీనా ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆదోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హసీనా మృతి చెందింది. మృతురాలు తండ్రి మోదింసాబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఫైర్ స్టేషన్ దగ్గరలోని హేమంత్ వైన్స్‌లో దొంగతనం జరిగింది. పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. పట్టణ శివారులోని హేమంత్ వైన్స్‌లో కుమ్మరి వీధికి చెందిన కుమ్మరి నాగరాజు క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. 11వ తేదీ కలెక్షన్ రూ.90 వేలను దుకాణంలో ఉంచాడు. శుక్రవారం యథావిధిగా షాపు తెరిచి చూడగా వెనుక నుంచి రేకుల షెడ్డును తొలగించి నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలిం చారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బార్ల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు అర్బన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు పెండింగ్ బార్లకు సంబంధించి దరఖాస్తులను స్వీకరణకు ఈ నెల 17 వరకు గడువు పొడిగించారు. ఈ నెల 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి 14తోనే ముగియాల్సి ఉన్న ప్రక్రియకు ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. కర్నూలు 4, ఎమ్మిగనూరు 2, గూడూరు 1 బార్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి దరఖాస్తులు వేసేందుకు యజమాన్యాలు ముందుకు రాలేదు.

కేజీబీవీ తనిఖీ



కస్తూర్బాలో ఆహారాన్ని పరిశీలిస్తున్న గంజిమల దేవి

ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తుర్భాగాంధీ బాలికా విద్యాలయాన్ని శుక్రవారం ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఆహార నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించారు. అలాగే స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచి సరుకులను తనిఖీ చేసి గడువు తీరిన సరుకులు ఉన్నాయా? అని తనిఖీ చేశారు. అలాగే కేజీబీవీలో అందుతున్న సౌకర్యాలు, ఆహార పదార్థాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి రవిబాబు, జిల్లా మేనేజర్ అశ్వర్థనారాయణ నాయక్, తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, సోషల్ వేల్ఫేర్ అధికారి అంకన్న, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

• రోడ్డెక్కిన బాధిత కుటుంబ సభ్యులు • పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం



దేవనకొండ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

దేవనకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చిన్నారిని చంపి, భార్యపై కర్కషంగా దాడి చేసిన భర్త నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ బాధిత కుటుంబ సభ్యులు, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, జనసేన పార్టీల నాయకులు రోడ్డెక్కారు. ముందుగా చాకలి వీధిలోని నరేష్ ఇంటిపై శ్రావణి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దాడి చేసి ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేసి, బస్టాండ్‌కు చేరుకొని ధర్నా చేశారు. శ్రావణికి న్యాయం చేసి బాలుడు సాగర్‌ను నీటి డ్రమ్ములో ముంచి హత్యచేసిన తండ్రిని శిక్షించాలంటూ, దా దాపు ఐదు గంటలపాటు దేవనకొండ-కర్నూలు రహదారిపై ఆందోళన చేశారు. పలుమార్లు ఆందోళన విరమించాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ వంశీనాథ్ నచ్చజెప్పే ప్రయత్నం చేసి విఫలయత్నం అయ్యారు. ఓ సందర్భంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో పలువురు ఆందోళనకారులు పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితులను సద్దుమణిగించారు. ఐదు గంటలపాటు రహదారిపై ధర్నాలో వాహనాలు ఆగిపోవ డంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డీఎస్పీతోపాటు, పరిసర ప్రాంతాల సీఐలు జయన్న, పులిశేఖర్, గంగధర్, నల్లప్ప, ఆందోళనకారులను శాంతింపజేస్తూ పరిస్థితులను తమ అదుపులోకి తెచ్చుకొని వాహనాలను తరలించారు. అనంతరం ఆందోళన కారులతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రావణికి న్యాయం చేస్తామన్నారు.



మహిళలకు నచ్చజెప్పుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య



నిందితుడు సాకే రాజుకుమార్

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కర్నూలు లీగల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి బాలికను కిడ్నాప్ చేసి ఆ తర్వాత పలుమార్లు అత్యాచారం చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.35 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాదికారి ఈ.రాజేంద్రబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నంద్యాలకు చెందిన బాలిక తల్లిదండ్రులు చిరు వ్యాపారం చేసుకుంటూ వారి పిల్లలను చదివించుకుంటుండేవారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోజూ వచ్చి నంద్యాలలో ఉంటున్న సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్ద ఆ బాలికకు మాయమాటలు చెప్పేవాడు. ఈ క్రమంలో 2018 నవంబరు 14న బాలికకు మాయమాటలు చెప్పి కర్నూలు తీసుకెళ్లి అక్కడి నుంచి బస్సులో విజయవాడకు తీసుకెళ్లాడు. రాజుకుమార్ విజయవాడలో తన తల్లి వద్దకు తీసుకెళ్లి బాలికను పరిచయం చేశాడు. ఆ తర్వాత నిందితుడు ఆ బాలికను తన ఇంట్లో ఉంచుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు. తిరిగి నిందితుడు ఈ బాలికను హైదరాబాదుకు తీసుకెళ్లి ఓ లాడ్జిలో ఉంచి పలుమార్లు అత్యాచారం చేశాడు. 2019 మార్చి 10వ తేదీన బాలిక తప్పించుకుని నంద్యాలకు చేరుకుని జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. కూతురు కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక తల్లిదండ్రులతో కలిసి నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసును మార్చి కిడ్నాప్, అత్యాచారం సెక్షన్ల కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు కేసును విచారించి నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు, బంధువులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. అయితే కోర్టులో సాకే రాజ్‌కుమార్‌పై మాత్రమే నేరం రుజువు కావడంతో అతడికి 20 సంవత్సరాల కారాగారశిక్షతో పాటు రూ.35 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధిత మహిళకు రూ.2 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీవీ శ్రీనివాసులు వాదించారు.

అన్ని మతాలను గౌరవిస్తాం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని మతాలను తాను సమానంగా గౌరవిస్తామని పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని 10వ వార్డులో ఆధునికీకరించిన ధర్వేశ్ ఖాద్రి దర్గాను మంత్రి టీజీ భరత్ సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మహబూబ్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మసీదులో విద్యనభ్యసించే విద్యార్థులకు మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సైకిళ్లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు నూరి మన్సూర్, ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. 32 బైకులు స్వాధీనం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు బైకు దొంగతనాలకు పాల్పడుతున్న జయంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 32 బైకులను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజురావు, ఎస్ఐలు సతీష్, మల్లికార్జున శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన జయంత్ సులువుగా డబ్బులు సంపాదించేందకు చోరీ చేయడం మొదలు పెట్టాడు. చోరీ చేసిన బైకులను రూ.5వేలు, రూ.10వేలకు విక్రయించి వచ్చిన డబ్బులో జల్సా చేస్తుంటాడు. నిందితుడు కర్నూలులోని పలు హాస్పిటల్స్ కూడళ్ల వద్ద చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితున్ని పట్టుకోవడానికి స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి 32 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కోడుమూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రవీంద్ర వైన్స్ దగ్గర ఈ నెల 6న జరిగిన గిరి హత్య కేసులో నిందితుడు పింజరి మౌలాలిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మహమ్మద్ తబ్రేజ్ తెలిపిన వివరాలివీ.. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గిరి, మౌలాలి స్నేహితులు. గిరి తన స్నేహితుడు మౌలాలికి, అతడి సోదరిడికి తరచూ గొడవలు సృష్టించేవాడు. దీంతో గిరిని హతమార్చాలని మౌలాలి పథకం వేసుకొన్నాడు. ఈ నెల 6న గిరిని మద్యం తాగడానికి ఆహ్వానించాడు. మద్యం సేవించిన అనంతరం తన వెంట తెచుకొన్న కత్తితో గిరి దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. ఎస్ఐ డీవై స్వామి, మణికంఠ ఉన్నారు

ఉల్లి రైతులకు భరోసా



రైతులతో మాట్లాడుతున్న జేసీ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లిని మొత్తం కొనుగోలు చేసి వారికి భరోసా కల్పిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య తెలిపారు. ఇప్పటికే క్వింటా రూ.1,200తో కొనుగోలు చేసిన రైతుల బ్యాంకు ఖాతాలకు వ్యత్యాసం ఉన్న నగదును జమ చేస్తున్నామన్నారు. శుక్రవారం జేసీ నవ్యతో పాటు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ ఉపేంద్ర, ఏడీఎంలు సత్యనారాయణ చౌదరి, నారాయణ మూర్తి, కర్నూలు మార్కెట్ కమిటి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి రైతులతో మాట్లాడారు. రైతులు తెచ్చిన ఉల్లిలో 6,749 క్వింటాళ్ల వ్యాపారస్తులతో కొనుగోలు చేయించామని, మిగిలిన 5,576 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని జేసీ వివరించారు. మీరు తెచ్చిన ప్రతి ఉల్లి గడ్డను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రతి రైతుకు క్వింటాకు రూ.1,200 ధర అందిస్తున్నామనీ స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.కోటి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. రైతులు పక్వానికి వచ్చిన ఉల్లినే మార్కెట్ కు తీసుకురావాలని, పొలాల వద్దనే గ్రేడింగ్ చేసి తెస్తే యార్డులో అమ్మకం కోసం కష్టాలు పడాల్సిన ఇబ్బంది ఉండదని జేసీ తెలిపారు. రైతులు తెచ్చిన ఉల్లిని త్వరితగతిన కొనుగోలు చేసి బయటకు తరలించాలని వ్యాపారులు, మార్క్‌ఫెడ్ అధికారులును జేసీ ఆదేశించారు. జేసీ వెంట కర్నూలు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, అసిస్టెట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోడుమూరు సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న తదితరులు ఉన్నారు.

వాహనాలు సీజ్

• రూ.2.4 లక్షలు జరిమానా

మహానంది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి అంకిరెడ్డి చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లను సీజ్ చేసి రూ.2 లక్షల 40 వేల జరిమానాను విధించినట్లు విజిలెన్స్ ఎస్ఐ వెంకట ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అర్ధరాత్రి గాజులపల్లి వైపు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 6 టిప్పర్లను గుర్తించి స్వాధీనం చేసుకొన్నారు. వీటిని మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో భాగంగా టిప్పర్లు అధిక లోడుతో ఉన్నట్లు గుర్తించి జరిమానాలు విధించినట్లు విజిలెన్స్ ఎస్ఐ చెప్పారు.

కలెక్టర్ సిరికి ఘన స్వాగతం

• నేడు బాధ్యతల స్వీకరణ



నూతన కలెక్టర్‌కు బొకే ఇస్తున్న జేసీ నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్/ఓర్వకల్లు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం నూతన కలెక్టర్ సిరి బాధ్యతలు స్వీకరించనున్నారు. నగరంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్‌ని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఓర్వకల్లు విమానాశ్రయంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, తహసీల్దార్ విద్యాసాగర్ ఘన స్వాగతం పలికారు.

నగరడోణలో డెంగీ పాజిటివ్

ఆలూరు(చిప్పగిరి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం నగరడోణ గ్రామంలో డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 1వ తేదీ నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడి వైద్యులు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించినట్లు వైద్యాధికారి అఫ్రోజ్‌జహాన్ తెలిపారు. శుక్రవారం అధికారులు అప్రమత్తమ య్యారు. గ్రామంలో యాంటీ లార్వా లిక్విడ్ పిచికారీ చేయించారు. వైద్యశిబిరం నిర్వహించి, గ్రామస్థుల నుంచి రక్త నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.



గ్రామంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అఫ్రోజ్‌జహాన్

యూరియా బస్తాల సీజ్

పాణ్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, రసాయన మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పాణ్యంలోని శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉన్న రూ.15,457 విలువైన 58 బస్తాల యూరియాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఎంఏవో జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి విశ్వనాథ్, ప్రత్యేక తహసీల్దారు వెంకటనారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీకి వీలున్న క్రిమినల్, సివిల్, ప్రిలిటిగేషన్ కేసులు ఈజాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరిం చుకోవచ్చని అన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరిం చేందుకు పలు బెంచీలను ఏర్పాటుచేశామన్నారు. ప్రతి బెంచ్‌లో ఒక న్యాయాధికారి, ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వలంటరీ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

విద్యార్హతలకు అనుగుణంగా విధులు అప్పగించాలి

● గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు




ఆత్మకూరు: ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు.. పగిడ్యాలలో..

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు విద్యార్హతలకు అనుగుణంగా ఆయా శాఖలలో విధులు అప్పగించేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆత్మకూరు జేఏసీ కమిటీ సభ్యులు స్వాములు, నారాయణ ఆచారి, రత్నస్వామి, అతావుల్లా, శశి, పోలీసులు పార్వతీబాయి, రోజా బిందు డిమాండ్ చేశారు. జేఏసీ పిలుపు మేరకు ఆత్మకూరు మండల సచివాలయ ఉద్యోగులు శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సయ్యద్ ఉమ్మర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కల్పించాలన్నారు. ఉద్యోగులను ఆయా శాఖల మాతృశాఖలకు అప్పగించాలని, సమయపాలన లేని, ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాల పాటు ఒకే కేడర్‌లో పనిచేసిన సిబ్బందికి ఏఏఎస్ ద్వారా స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. అన్ని విభాగాల వారికి ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేసి జిల్లాల వారిగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల వివిధ శాఖల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పగిడ్యాల: తమకు పనిభారం తగ్గించాలని సచివాలయ సిబ్బంది శుక్రవారం పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి తమకు విముక్తి కలిగించాలన్నారు. తమను మాతృశాఖలకు అప్పగించాలని, ఒత్తిడితో కూడిన విధులు అప్పగించరాదన్నారు. కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడి యో కాన్ఫరెన్స్‌లు, సెలవు దినాలలో బలవంతపు విధులు చేయించడం తగదన్నారు. అలాగే ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అన్ని విభాగాల వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పట్టు వస్త్రాలు అందజేత



మహానందిలో ఆలయ అధికారులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న దాతలు

మహానంది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల కోసం హైదరాబాద్‌కు చెందిన రామ్మోహన్‌రావు దంపతులు పట్టు వస్త్రాలను అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని అలంకార మంటపంలో దాతలు ఆలయ వేదపండితులకు పట్టు వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు తాము పట్టు వస్త్రాలను అందచేస్తున్నామని, ఈ ఏడాది కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

మహానందీశ్వరునికి ఘనంగా పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో శుక్రవారం స్వామివారికి ఆలయ వేదపండితులు ఘనంగా పల్లకిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకార మంటపంలో ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, భక్తుల శివనా మస్మరణ మధ్య ఆలయ పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

గడివేముల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజనూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో సుబ్బరామిరెడ్డి హిందీ భాష ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో హిందీని ఆయుధంగా మలుచుకొని పోరాటం చేశారని అన్నారు. అనంతరం రాహూస్ కళాశాల అధ్యాపకులు ఫరీద్ విడుదల చేసిన హిందీ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగమయ్య, మానపాటి రవి, మహేశ్వరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గడివేముల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని బిలకలగూడురు గ్రామంలో శుక్రవారం ప్రజలు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపినా, గ్రామాల్లో అల్లర్లు సృష్టించినా, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు అతివేగంతో వాహనాలు నడపరాదని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య మాట్లాడుతూ నాలుగు కరువు భత్యాలు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ఎందుకు ప్రకటించలేదన్నారు. 2003 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు 57 మెమో ద్వారా వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సరెండర్‌లీవ్ బకాయిలు రెండేళ్లయినా చెల్లించకపోవడంతో ఉపాధ్యాయుల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి పెరుగుతోందన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వాటిని నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏడు రోజులు నిరసన వారం చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు జాకీర్‌హుసేన్, రమణ, శ్రీరాములు, దస్తగిరిబాష తదితరులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతలో రాజీపడొద్దు

బండిఆత్మకూరు సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు అందించే ఆహార నాణ్యతలో రాజీపడొద్దని ఫుడ్ కమిషన్ సభ్యురాలు మల్లాదేవి అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఏ కోడూరులో అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరశాల, బండిఆత్మకూరు జడ్పీహెచ్ స్కూల్‌లో ఆహార నాణ్యతను, వంటశాలలను, విద్యార్థుల హాజరు, మెనూ రికార్డులు పరిశీలించారు. భోజనం నాణ్యంగా అందించాలని హెచ్ఎంకు సూచించారు. డిప్యూటీ డీఈవోలు శంకర్ ప్రసాద్, వెంకట రామిరెడ్డి, సీడీపీవో కోటేశ్వరీ, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

వెలుగోడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు వంట నిర్వాహకులు నాణ్యమైన భోజనాన్ని అందిం చాలని ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి సూచించారు. శుక్రవారం ఆమె వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అబ్బిరాజుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

సీతారాం ఏచూరి వర్ధంతి

బండిఆత్మకూరు సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని శుక్రవారం సీపీఎం నాయకులు నిర్వహించారు. డేవిడ్, రత్నమయ్య, రామచంద్రుడు, రాజు, సుబ్బరాయుడు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

ఘనంగా అగ్నివీర్ మురళీ నాయక్ స్మృత్యంజలి



అగ్నివీర్ మురళీనాయక్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన అగ్నివీర్ మురళీ నాయక్ స్మృత్యంజలి కార్యక్రమం శుక్రవారం రామక్రిష్ణ డిగ్రీ కాలేజి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కేర్ గ్రూప్ ఆఫ్ డాక్టర్స్ ఆధ్వర్యంలో మురళీ నాయక్ తల్లితండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఉదయశంకర్, రామక్రిష్ణారెడ్డి, విజయ్ బాబు, హరినాథరెడ్డి, నర్మద, వసుధ, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు వర్ధన్‌రెడ్డి, సైనిక కుటుంబాలు, విద్యార్థులు, పాల్గొని మురళీనాయక్ తల్లితండ్రులను సన్మానించి ఆర్థిక సహాయం చేశారు.

ఒంటరి మహిళను అక్కున చేర్చుకున్న సొసైటీ

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్‌లో నిర్వహిస్తున్న స్వధార్ హోమ్ నిర్వహకురాలు లక్ష్మీదేవి కోడూరు గ్రామానికి చెందిన శిరీషను పోలీసుల సహకారంతో అక్కున చేర్చుకున్నారు. రాత్రి ఒంటిగంట సమయంలో నంద్యాల పట్టణంలో ఉన్న పోలీసులు ఆ మహిళను స్వధార్ హోమ్‌లో చేర్పించారు. ఇటువంటి వారు ఇంకా ఎవరైనా ఉంటే స్వధార్ హోమ్ నిర్వహకులను సంప్రదించాలని కోరారు.

రణభేరి జాతాను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గోస్పాడు, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : రణభేరి ప్రచార జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మండల నాయకుడు వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు విద్యారంగంలో నెలకొన్న, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక పరమైన సమస్యలపై రణభేరి ప్రచార జాతాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం సేవించిన ఆరుగురికి జరిమానా

నంద్యాల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున న్యాయస్థానం జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. పట్టణంలోని వై జంక్షన్ వద్ద వారిని అదుపులోకి తీసుకొని ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

● నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కా రం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం చేపడుతోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్య ఆధ్వ ర్యంలో అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి 18 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంఈవో, పంచాయతీరాజ్ ఏఈల పని తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలోని సీసీ రోడ్ల నిర్మాణాల కోసం తీర్మానాలు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రుద్రవరం గ్రామంలో హైవే కింద పాఠశాల పోవ డంతో ప్రత్యామ్నాయంగా వచ్చిన నిధులతో కొత్త స్కూల్ నిర్మాణ విషయంతో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని ఎంఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తుమ్మలూరు గ్రామానికి చెందిన మొల్ల హజరాబి కుటుంబానికి ముఖ్య మంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.51,133 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో మహేశ్వరరెడ్డి, ఏపిఎం మహేశ్వరమ్మ, టీడీపీ నాయకులు చెల్లె హరినాథరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటేశ్వరరావు, శివశంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊయలసేవ



స్వామి, అమ్మవార్ల ఊయలసేవలో ఈవో దంపతులు

శ్రీశైలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో లోక కల్యాణార్థం శుక్రవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ నిర్వహించారు. అనంతరం పుష్పాలంకరణ, పుష్పార్చన చేశారు. గ్రామదేవత అంకాళమ్మకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం నిత్యకళారాధనలో భాగంగా బులుసు సూర్యనారాయణ బృందం హైదరాబాద్ వారిచే గాత్రకచేరి జరి గింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.

భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ఆహారం అందించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి

నందికొట్కూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ఆహారం అందించాలని, ఇందుకోసం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మ భవనంలో ఏపీసీఎన్ఎఫ్(ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్) ద్వారా రైతు సేవ కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, నందికొట్కూరు ఏడీఏ గిరీష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల నేల నాణ్యత దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ఆహారం అందించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. (ప్రీ-మన్సూన్ డ్రై సోయింగ్) పీఎండీ ఎస్ అనే వినూత్న పద్ధతిని అభివృద్ధి చేశారన్నారు. రైతులు రసాయన ఎరువులను తగ్గించి భూమిని కాపాడే విధంగా ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు, మిడ్తూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల ఏవోలు, టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

143.64 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

● మండల వ్యవసాయాధికారిణి అమీరున్నిసా బేగం



యూరియా పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారిణి అమీరున్నిసా బేగం

కొత్తపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల రైతాంగానికి 143.64 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి అమీరున్నిసా బేగం తెలిపారు. మండల టీం పర్యవేక్షణలో రైతుల ఆధార్, పట్టాదార్ పాసుబుక్ ఆధారంగా పంపిణీ చేశామన్నారు. శుక్రవారం గువ్వలకుంట్ల, శివపురం, ఎదురుపాడు, నందికుంట కొత్తపల్లి గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా అవసరమైన రైతులకు మాత్రమే పంపిణీ చేశామని తెలిపారు. ఇదిలా ఉంటే.. ముందుజాగ్రత్త చర్యలో భాగంగా కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ పర్యవేక్షణలో స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీమ్‌తో పాటు ఆయా గ్రామాల వీఆర్వోలు వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి: మంత్రి



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మైనారిటీ, న్యాయ, సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. శుక్రవారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలి

పాణ్యం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో ఈక్రాప్ నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఈ క్రాప్ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ సిబ్బంది నిర్వహించిన నమోదును వీఆర్వోలు నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. మండలంలో 35 వేల ఖాతాల పుస్తకాలు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు దాదాపు ఐదు వేలు పూర్తి చేసినట్లు తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎంలు 12 వందలు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. 7889 కుల ధ్రువీకరణ పత్రాల నమోదును సుమోటాగా తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3500 శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు మనమిత్రలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కావున కుల ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు. వ్యవసాయానికి రాత్రి 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు సరఫరా ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తలేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూరు డీడీపీ అన్వార్‌బేగం తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని మండ్లెం, తంగడంచ గ్రామాల్లో చెత్త సేకరణపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను వీధుల్లో, రోడ్లపై పడేయకుండా చెత్తసేకరించే బండిలోనే వేయాలని సూచించారు. దీంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా రోగాలు రాకుండా ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునికంగా తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు, దైవదర్శనం టికెట్ల బుకింగ్, పీజీఆర్ఎస్, అన్నదాత సుఖీభవ తదితరాలకు వాట్సాప్ 955230 0009 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే 200 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా సేవలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' పై విద్యార్థులకు అవగాహన

మహానంది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బొల్లవరం గ్రామంలో శుక్రవారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యులు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు బయట ఎలా ప్రవర్తించాలి, అపరిచి తుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగా హన కల్పించారు. అత్యవసర సమయాల్లో 100కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, మహిళల సంరక్షణ డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్లల్లో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకు ని ఆపద సమయంలో వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు వెంకటేశ్వర్లు, రఫి, పోలీస్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో 30.6 మి.మీ. వర్షపాతం

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో మొత్తం 30.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షం వల్ల పైర్లకు ఎరువులు వేసుకునే అవకాశం లభించిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తకనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న కురవ కమిటీ సభ్యులు

గడివేముల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కురవ కులస్థుల ఆరాధ్యదైవం భక్తకనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కురవ సంఘం మండల అధ్యక్షుడు రామస్వామి, ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకం దారుల సంఘం డైరెక్టర్ యుగంధర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆలూరు మండలం మనికుర్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు.

ఇందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కురవ సంఘం నాయకులు శ్రీనివాసులు, విశ్వం, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన పాలేరు వాగు
- నిలిచిన వాహనాల రాకపోకలు


సంజామల సమీపంలో ప్రవహిస్తున్న పాలేరు వాగు

సంజామల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాలేరువాగు ఉప్పొంగింది. కోవెలకుంట్ల నుంచి అవుకు, ముదిగేడు, సంజామల మీదుగా తాడిపత్రికి వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సులు సైతం తిరగక ప్రయాణికులు ఇబ్బందులు ఎదర్కొన్నారు. పరివాహకం గ్రామాలైన కమలపురి, బొందలదిన్నె, వసంతాపురం, ముదిగేడు, ముక్కమళ్ల, ఎగ్గోని, ముచ్చలపురి, కొత్తపేట, సంజామల గ్రామాల్లోని వాగు పరివాహక ప్రాంతంలో సాగైన వరి పంట వరద ముంపునకు గురైంది. వాగు ఉప్పొంగడంతో లోతట్టు గ్రామమైన కమలపురి జలమయమైంది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఉయ్యాలవాడ: కుందూ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ప్రసాద్‌బాబు సూచించారు. శుక్రవారం బోడెమ్మనూరు గ్రామ కుందూ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు మోటార్ల వద్దకు వెళ్ల కూడదన్నారు.

రుద్రవరం: నదీతీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దారు చంద్రశేఖరయ్య శుక్రవారం తెలిపారు. గ్రామాల నుంచి సమాచారం ఎప్పటికప్పుడు సేకరించాలని గ్రామ రెవెన్యూ అధికారులను తహసీల్దారు ఆదేశించారు.

నీట మునిగిన కంది పంట


నీట మునిగిన పంట

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గడిచిన 24గంటల్లో మండలంలోని వివిధ గ్రామాల్లో ఎనిమిది మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో భాస్కరరెడ్డి శుక్రవారం వెల్లడించారు. పలు గ్రామాల పరిధిలో పంటలు నీట మునిగాయి. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చౌడేశ్వరీమాత ఆలయ కమిటీ చైర్మన్‌గా నాగార్జునరెడ్డి



బనగానపల్లె, సెప్టెంబరు 12, (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయ కమిటీ చైర్మన్‌గా పీవీ. నాగార్జునరెడ్డి నియమితులైయ్యారు. శుక్రవారం దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ నాగార్జునరెడ్డి తెలిపారు. అలాగే సభ్యులుగా చింతా శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, సి.రాజేశ్వరి, ఎం.హారిక, టి.కుళాయమ్మ, శశికళ, శారద, లోకేశ్, ఐ.సుదర్శన్‌రావు, డి. బాలదస్తగిరి, ఎక్స్ అఫీసియో సభ్యుడిగా పూజారి రామకృష్ణశర్మను నియమించారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ మంత్రి బీసీ సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని తెలి పారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ రమణయ్య శుక్రవారం అన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. తడిచిన కరెంట్ స్తంభాలను పట్టుకోరాదన్నారు.

రణభేరిని జయప్రదం చేయాలి

ప్యాపిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ చేపట్టనున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం సీనియర్ నాయకుడు అబ్దుల్ లతీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో రణభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సర్వజ్ఞమూర్తి, మోహన్‌రెడ్డి, చార్లెస్ పాల్గొన్నారు.

జీవామృతంతో పంటకు బలం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవామృతంతో పంటలకు బలమని ఏవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం రూపనగుడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసిన జీవామృత ఎరువును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రైతు ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

బనగానపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఆదర్శనీయుడు స్వామి వివేకానంద అని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో వివేకానంద 132వ చికాగో సర్వమత సభ సంస్మరణ కార్యక్రమాన్ని బొంతల ఫణీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు బీసీ ఇందిరమ్మ బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, టీచర్ నాగరాజు, శరత్‌బాబు, డాక్టర్ శరత్‌చంద్ర, టీచర్ ప్రతాప్, భరతుడు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమోటా సాగు చేసే రైతులకు కొత్త యాజమాన్య పద్ధతులపై, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని సీతారామాపురం గ్రామంలో రైతు రామేశ్వరరెడ్డి సాగు చేసిన ఉల్లి, టమోటా పంటల పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సహాయకుడు గిరిధర్, ఉద్యాన శాఖ అధికారులు రామాంజనేయులు, ఫిరోజ్, నాగరాజు, సత్యనారాయణ, శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

సంజామల,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సంజామల మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు సూచించారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలేఖ, హెల్త్ ఎడ్యుకేటర్ నారాయణదాసు, ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె

బేతంచెర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో మట్టిమిద్దె కూలింది. శుక్రవారం బాధితుడు దూదేకుల హుశేన్‌కు చెందిన మట్టిమిద్దె పైకప్పు కూలింది. దాదాపు రూ.లక్ష రూపాయలు మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం ఆర్థిక సహా యం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

ప్రజాప్రతినిధులే..
గైర్హాజరైతే ఎలా?

- మూడుసార్లు హాజరు కాని వారిని డిస్క్వాలిఫై చేయండి
- కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి
- మండల సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు ఎంపీటీసీ, సర్పంచులు గైర్హాజరైతే ఎలా?.. వారు ఎలా ప్రజాసమస్యలు పరిష్కరిస్తారని రోడ్లు భవనాలశాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాసనవీణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు బాధ్యతతో హాజరు కావాలన్నారు. ప్రజల కోసం ఎన్నుబడ్డ వారు బాధ్యత లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. మూడుసార్లు సమావేశాలకు హాజరు కాని ఎంపీటీసీ, సర్పంచుల వివరాలు ఇవ్వాలని, వారిని డిస్క్వాలిఫై చేయాలని ఎంపీడీవో నాగరాజును మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, మంత్రి బీసీ బీసీ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్‌ను ఆదేశించారు. గ్రామాల్లో వ్యాధుల ప్రబలకుండా ప్రతి 15రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో మంత్రి బీసీ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరతలేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖపై జరిగిన చర్చలో మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి ట్రాన్స్‌ఫార్మర్ ఒక స్థలం నుంచి మరో స్థలానికి మార్చడం లేదని ఫిర్యాదు చేయగా, మంత్రి జోక్యం చేసుకొని వెంటనే మార్చాలని విద్యుత్ ఏఈ గర్జప్పను ఆదేశించారు. విద్యాశాఖపై చర్చించారు. హెచ్‌ఎంల వద్ద ఉన్న నిధులతో ఆర్వో ప్లాంట్లను మరమ్మతు చేయించాలని మంత్రి ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మురుగుకాల్వలను ఆక్రమించారని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఆక్రమణలను తొలగించకుంటే ఆర్టీసీ అధికారులపై కేసులు పెడతామని మంత్రి హెచ్చరించారు. అనంతరం సభ్యులను ఉద్దేశించి మంత్రి బీసీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించినట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణంలో రూ.70 కోట్లతో వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం: కోట్ల


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆర్డీవో కేపీ నరసింహులు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్ రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ సురేష్, ఏఈ హరికృష్ణ, ఆయా శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా, సీపీఎం ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు తొలగించడం సరికాదన్నారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

- టీబీ ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో హరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పశు సంవర్థక శాఖ వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో గాలి,కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే విడుదల చేశారు.
- పట్టణం సమీపంలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఆగ్రిసోల్ సంస్థ సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగింపు

- సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల నిరసన


ప్రభుత్వ భూమిలో వేసిన గుడిసెలను తొలగించిన అధికారులు

డోన్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం గుత్తి రోడ్డు సమీపంలోని సర్వే నెంబర్ 503లో పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం తొలగించారు. దీంతో స్థానికులు అడ్డుకోగా, సీపీఎం నాయకులకు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. దాంతో పేదలు నిరసనకు దిగారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పీజీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కోట్ల ప్రభుత్వ జీవో వచ్చిన వెంటనే అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనలు విరమించారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు, రెహిమాన్, షమీమ్ భేగం, శివరామ్, నక్కి హరి పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్)పేదలకు వరమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 40 మంది కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 33.33లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆయా కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు బాధిత కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్లూయిస్ లీకేజీలను అరికట్టాలి: ఎంపీపీ


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి కలిమున్నిసా

అవుకు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రిజర్వాయర్ స్లూయిస్ లీకేజీలను అరికట్టే విధంగా ఎస్సార్బీసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రిజర్వాయర్‌లో అంతర్భాగమైన పాలేరు స్లూయిస్, స్పిల్‌వే స్లూయిస్‌లు మరమ్మతులకు గురి కావటంతో భారీగా సాగు నీరు లీకేజీ అవుతోందన్నారు. దీంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. స్లూయిస్ మరమ్మతుల పనులను చేపట్టాలని ఎస్సార్బీసీ అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి కలిమున్నిసా మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్‌లో వరితో పాటు మొక్కజొన్న పంట అధికంగా సాగు చేశారన్నారు. యూరియాను రైతుసేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేశామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశ్వంత్ మాట్లాడుతూ సీజనల్‌లో ప్రజలే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ భారతీదేవి మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో శ్రీధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీ ల్దార్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ యమున, ఎస్సార్బీసీ డీఈ సుబ్బా రావు, ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, ఎన్‌ఆర్ ఈజీఎస్ ఏపీవో ప్రకాష్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని, వైస్ ఎంపీపీ రామప్ప, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట


నీటి మునిగిపోయిన వరి పంటను చూపుతున్న రైతులు

మండలంలోని ఎర్రమల కొండల్లో కురుస్తున్న వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గొల్లలేరు డ్రెయిన్ కెనాల్‌కు వర్షపు నీరు భారీగా చేరటంతో దిగువన ఉన్న చెన్నంపల్లె, శివవరం గ్రామాల పరిధిలో దాదాపు 500 ఎకరాలు వరి పంట నీట మునిగింది. మెట్టుపల్లె భల్లాకుంట చెరువు అలుగు పారుతుండటంతో దిగువ గ్రామాలైన రాఘవరాజపురం, నిచ్చెనమెట్ల, అన్నవరం గ్రామాల పరిధిలో 50 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. నీరు పొలాల నుంచి బయటకు పోయే లోపు నాటిన వరినారు కుళ్లి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

- అవుకు (ఆంధ్రజ్యోతి)

అడుసుదారి..

మండలంలోని నేలంపాడు, గొట్లూరు గ్రామాలకు వెళ్లే రహదారి అడుసు (బురద)దారిగా మారింది. రహదారి అధ్వాన స్థితికి చేరుకోవడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు శుక్రవారం భారీ వర్షం కురవడంతో అందులో నీరు నిలిచి వాహన దారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు గుంతలను తప్పించబోయి అదుపు తప్పి పడిపోయారు. పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచి నీటి కుంటలను తలపిస్తున్నాయి. అలాగే పలు గ్రామాలకు వెళ్లే దారులు కూడా ఇలాగే మారాయి. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు విన్నవిస్తున్నారు.

- చాగలమర్రి, (ఆంధ్రజ్యోతి)


నీటి కుంటగా గొట్లూరు రహదారి

ఎమ్మార్సీ భవనం కోసం స్థల పరిశీలన

చాగలమర్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మార్సీ నూతన భవనం నిర్మించేందుకు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఎంపీపీ వీరభద్రుడు, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల కలిసి ఎంపీడీవో కార్యాలయం వద్దగల స్థలాన్ని పరిశీ లించారు. ఎంఈవోలు మాట్లాడుతూ ఎమ్మార్సీ భవనం నిర్మించేందుకు సమగ్రశిక్ష ద్వారా రూ.53 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వారి వెంట హెచ్‌ఎంలు శేషాద్రి, నరసింహులు ఉన్నారు.

వాసవీమాతకు క్షీరాభిషేకం

చాగలమర్రి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీమాతకు క్షీరాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం పూజలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలు సామూహికంగా వడిబియ్యం, కుంకుమార్చన నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి నవతాప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12 టన్నుల యూరియా మంజూరు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ సొసైటీకి 12 టన్నుల యూరియా మంజూరు అయినట్లు వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీసులతో కలిసి యూరియా నిల్వలను ఏవో పరిశీలించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బుచ్చన్న, రైతులు ఉన్నారు.

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

శిరివెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ బాలరాజు పేద విద్యార్థులకు దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఆర్థిక లేమితో పడుతున్న ఇబ్బందులను గుర్తించిన లెక్చరర్ తనవంతు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు బాలచంద్రుడు, అంజయ్య చౌదరి, గోవిందస్వామి నాయక్, విక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి


అలేబాదులో ఆందోళన చేస్తున్న కురువ సంఘం నాయకులు

ప్యాపిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అలూరు మండలంలోని మణేకుర్తి గ్రామంలోని భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కురువ సంఘం మండల నాయకుడు అలేబాదు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అలేబాదు గ్రామంలో పరమేష్ ఆధ్వర్యంలో కురువులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు మల్లికార్జున, పెద్దరాజు, శేఖర్, హరికుమార్, సంజన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- పట్టణంలో సుడిగాలి పర్యటన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి

బనగానపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలోని కరీముద్దీన్ కాలనీ, కరీంబాగ్ వీధి, కాజీవాడ, జీఎం టాకీస్ వీధి, పెద్దవీర్లచావిడి, మంగళవారంపేటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే కరణం మొహిద్దీన్ కాలనీ వీధిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. పలుకాలనీలోని మహిళలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, అల్తాఫ్‌హుసేన్, గోపాల్‌రెడ్డి, భానుముక్కల సొసైటీ చైర్మన్ కలాం, రహిమాన్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పట్టణంలోని సచివాలయం- 2 సమీప పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ రికార్డులను, సచివాయల సిబ్బంది అటెండెన్సును పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై గ్రామ సచివాలయ సిబ్బందితో, ప్రజలతో ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలందిచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సచివాలయంలో పిచ్చిమొక్కలను తక్షణమే తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

కరాటే పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల హర్యాణలోని కురుక్షేత్రంలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహించారు. బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన చిన్నారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ విద్యార్థులు ఎ.నాగసాత్విక్, ఆర్.బాలాజీ నాయక్ , కె.సాయచరణ్ తేజ, దివ్యను ప్రత్యేకంగా అభినందించారు.

మైదానమిలా.. ఆడేదెలా.?


పాఠశాల మైదానం నిలిచిన వర్షపు నీరు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానం నీటి కుంటలా మారింది. వర్షాకాలం వచ్చిందంటే నెలల తరబడి వర్షపు నీరు పాఠశాల ఆవరణంలో నిలుస్తోంది.. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పాఠశాల మైదానంలోకి పెద్ద ఎత్తున వర్షం నీరు చేరింది. కోట్లాది రూపాయల నిధులతో నాడు-నేడు పనులు చేపట్టినా, డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు ఉన్నాయి. మైదానంలో ఆడుకోవాలన్నా, తరగతి గదుల బయట తిరగాలన్నా ఇబ్బందిగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా పాఠశాల ఆవరణంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- కొలిమిగుండ్ల, (ఆంధ్రజ్యోతి)